సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 30 । జనవరి । 2023

న్యూస్‌రీల్‌

31న వాహనాల వేలం

భువనగిరి : జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్‌ శాఖ కార్యాలయంలో ఈనెల 31వ తేదీన వాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ నవీన్‌కుమార్‌ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక హుందాయ్‌ కారు, ట్రాలీ ఆటోతో పాటు ఇతర వాహనాలను వేలం వేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ కోట్‌ చేసిన వారికి వాహనాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వాహనాలు కొనుగోలు చేయాలనుకున్నవారు 50 శాతం ఈఎండీ రూపంలో చెల్లించవల్సి ఉంటుందన్నారు. దక్కించుకున్న అనంతరం జీఎస్టీతో కలిపి మొత్తం చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు భువనగిరిలోని ఎక్సైజ్‌ శాఖ కార్యాలయంలో ఉదయం 11 లోపు 50 శాతం ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌ నంబర్‌ 9440902635 సంప్రదించాలని కోరారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం



జనగాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్‌ నారాయణపురం : నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. లచ్చమ్మగూడెం, చిల్లాపురం, వావిళ్లపల్లి, జనగాం, కొత్తగూడెంలో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్‌ డ్రెయినేజీలు,పాఠశాల, దేవాలయంలో అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గుత్త ఉమాదేవి, జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, గుత్త ప్రేంచందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ జంగారెడ్డి, సర్పంచ్‌లు అలివేలు, మంజుల, పాపయ్య, కళమ్మ, సుశీ ల, ఎంపీటీసీలు విజయ, జంగయ్య, పార్వతమ్మ,శ్రావణి, కత్తుల లక్ష్మయ్య, వెంకటేశం, తి రుమలేష్‌, అంజయ్య, ముత్యాలు, ఇమాలి, కృష్ణ, నరేష్‌, పెంటయ్య, భాస్కర్‌రెడ్డి, చంద్రం పాల్గొన్నారు.

ఇన్నర్‌వీల్‌ క్లబ్‌ అధ్యక్షురాలికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న లావణ్య

భువనగిరి : భువనగిరి ఇన్నర్‌వీల్‌ క్లబ్‌ అధ్యక్షురాలు ఇటికాల లావణ్యకు జాతీయ పురస్కారం లభించింది. క్లబ్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి యువ చైతన్య వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో అదివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిన్నిస్‌ బుక్‌రికార్డు అవార్డు గ్రహీత శాంతికృష్ణ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

గూడూరు టోల్‌ప్లాజాకు వాహనాల తాకిడి



టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

బీబీనగర్‌ : మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. ఆదివారం కావడంతో హైదరాబాద్‌ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి యాదాద్రి పుణ్యక్షేత్రానికి భక్తులు తరలివెళ్లారు. దీనికి తోడు శుభకార్యాలు ఉండడంతో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ నెలకొంది.


మన్‌కీ బాత్‌ వీక్షించిన బీజేపీ శ్రేణులు



చౌటుప్పల్‌ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్‌ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు వీక్షించాయి. ప్రధాని ప్రసంగాన్ని వారంతా ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్‌, మండల, పట్టణ అధ్యక్షులు రిక్కల సుధాకర్‌రెడ్డి, ఊడుగు వెంకటేష్‌, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మర్రి మల్లిఖార్జున్‌రెడ్డి, కట్ట కృష్ణ, కంచర్ల గోవర్ధన్‌ రెడ్డి, బాతరాజు గణేష్‌, లింగస్వామి, దుర్గయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

600 ఏళ్ల మెట్లబావికి మహర్దశ

- పునరుద్ధరణకు సమయం ఆసన్నమైందని ట్విట్టర్‌లో ట్వీట్‌ చేసిన కేటీఆర్‌
- రాయగిరి మెట్లబావి ఫొటోలు షేర్‌





కేటీఆర్‌ ట్వీట్‌ చేసిన మెట్లబావి చిత్రాలు

భువనగిరి : ఆదరణ కోల్పోతున్న వారసత్వ సంపదకు పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలంగా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మెట్ల బావులు, కోటలు, ఇతర చారిత్రక ప్రదేశాలను పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. ఇదే క్రమంలో భువనగిరి మండలం రాయగిరి పరిధిలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న 600 ఏళ్ల నాటి మెట్ల బావి విషయంలో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ స్పందించారు. మెట్లబావి పునరుద్ధరణకు సమమయం అసన్నమైందని అదివారం ట్విట్టర్‌లో ట్వీట్‌ చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సైతం షేర్‌ చేశారు. కేటీఆర్‌ చేసిన ట్వీట్‌ సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారడంతో రాయగిరి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే మెట్లబావిని సందర్శించిన కలెక్టర్‌

రాయగిరిలోని మెట్ల బావిని ఇప్పటికే కలెక్టర్‌ సమేలా సత్పతి సందర్శించి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. యాదాద్రి క్షేత్రానికి వచ్చిన భక్తులు పురాతన మెట్ల బావిని సందర్శించేలా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. తాజాగా కేటీఆర్‌ చేసిన ట్వీట్‌ మెట్లబావి పునరుద్ధరణపై ఆశలు రేకెత్తిస్తోంది.



చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి ఊరేగింపులో భక్తజన సందోహం

కల్యాణ వైభోగమే..



శంఖం ఊదుతున్న సాధువు



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మెట్ట వరి.. లాభాల సిరి

ఆరుతడి పద్ధతి ద్వారా అద్భుత ఫలితాలు

- సాగర్‌ ఆయకట్టులో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న పలువురు రైతులు
- ప్రోత్సహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- ఖర్చులు, శ్రమ తక్కువగా ఉండడంతో ఆసక్తి
- వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చంటున్న శాస్త్రవేత్తలు

భూసారం కాపాడేందుకు, వాతావరణ కాలుష్యం తగ్గించడమే లక్ష్యంగా రైతులు వరి సాగులో మెట్ట పద్ధతి అవలంబిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు రైతులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాయి. వరి పంటకు నీరు సమృద్ధిగా ఉండాలనేది తెలిసిన విషయమే. కానీ, ఆరుతడిలోనూ వరిసాగు చేయవచ్చని, ఈ విధానం ద్వారా.. నాటువేసే పద్ధతి కంటే మెరుగైన దిగుబడి సాధించవచ్చని సూర్యాపేట, నల్లగొండ జిల్లాల రైతులు నిరూపిస్తున్నారు.

(బి.జనార్దన్‌రెడ్డి)

ఆరుతడి (మెట్ట) పద్ధతి ద్వారా వరి సాగు చేస్తూ కొందరు రైతులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి లభ్యత సమృద్ధిగా ఉన్న దృష్ట్యా ఎక్కువ మంది రైతులు వరి సాగులో సంప్రదాయ పద్ధతికే మొగ్గుచూపుతారు. కానీ, పలువురు రైతులు ప్రయోగాత్మకంగా మెట్ట పద్ధతిలో వరి సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలు పొందుతున్నారు. మెట్ట పద్ధతిలో వరిసాగు పర్యావరణ హితం కావడంతో ఇంటర్నేషనల్‌ రైస్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌ (ఐఆర్‌ఆర్‌ఐ) టెక్నాలజీ సహాయంతో డాక్టర్‌ రెడ్డీస్‌ ఫౌండేషన్‌ ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఆరుతడి వరి సాగులో శ్రమ, పెట్టుబడి తక్కువగా ఉండడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు.



మధారిగూడెంలో సాగు చేసిన మెట్ట వరి చేను

పంట కాలం

నాటువేసే పద్ధతిలో కంటే ఆరుతడి(మెట్ట) పద్ధతిలో 15 రోజుల ముందే పంట వస్తుంది. నాటువేసే పద్ధతిలో సాగు చేసిన వరి పంట గాలివానలకు నేలవాలుతుంది. ఈ పద్ధతిలో చేలను దమ్ము చేయడం వల్ల నారు పైపైనే నాటు వేస్తారు. దీనివల్ల మొక్క వేరు వ్యవస్థ పైనే ఉంటుంది. కానీ, మెట్ట వరిలో దుక్కిలోనే నేరుగా విత్తనాలు లోతుగా వేయడం వల్ల వేరు వ్యవస్థ బాగా విస్తరిస్తుంది. కాబట్టి పంట గాలికి నేలవాలదు.

మెట్ట వరి సాగు విధానం

- ఆరుతడి పద్ధతిలో వరి సాగు చేసేందుకు వానాకాలం సీజన్‌ మరింత అనుకూలంగా ఉంటుంది. అప్పుడు భూమి పూర్తిగా ఆరిపోయి ఉంటుంది. మే నెలలో వచ్చే గాలివానలకు దుక్కి దున్నిపెట్టాలి. దీని ద్వారా భూమి ఆరుతుంది. గడ్డి కూడా కుళ్లిపోతుంది. పాత పంట పురుగుల అవశేషాలు పైకి వస్తాయి కాబట్టి పక్షులు తింటాయి. జూన్‌లో కల్టివేటర్‌తో దున్నుకుని లెవల్‌ చేసుకోవాలి.
- పంట సాగు చేసే విస్తీర్ణాన్ని బట్టి తగ్గిన మోతాదులో సీడ్‌ డ్రిల్‌ మిషన్‌తో ఒకేసారి విత్తనాలు, ఎరువులు వేసుకోవచ్చు. భూమిలోని పదనుతో విత్తనం రెండు మూడు రోజుల్లో మొలకెత్తుతుంది. లేనిపక్షంలో ఒక తడి నీరు పెట్టుకోవాలి.
- కలుపు రాకుండా.. పంట విత్తిన 48 గంటల్లోగా దుక్కిపై కలుపు మందు పిచికారీ చేయాలి.
- మొలక వచ్చిన తర్వాత బరువు నెలలు (రేగడి) అయితే 10 – 12 రోజుల్లో ఒక తడి నీరు ఇవ్వాలి. తేలికపాటి నేలలు అయితే 3 – 5 రోజులకు తడి ఇవ్వాలి. నేల స్వభావం, వాతావరణాన్ని బట్టి ఒక తడి నీరు ఇవ్వాలి.
- 15 రోజుల తర్వాత యూరియా ఎకరానికి 25 కిలోలు వేయాలి. మొక్క చిన్నగా ఉంటుంది కాబట్టి పెద్దగా అవసరం ఉండదు.
- యూరియా వేసిన తర్వాత మరుసటి రోజు నుంచి మూడు రోజుల్లో నీళ్లు ఉంచాలి. దీంతో ఎరువు మొక్కకు అందడంతో పాటు కలుపు నివారణ అవుతుంది. దాని తర్వాత ఆరుతడి పద్ధతి అవలంబించాలి.
- పంట విత్తిన 22 – 25 రోజులలోపు కలుపు ఉంటే పోస్ట్‌ ఎమర్జన్స్‌ కలుపు మందులు పిచికారీ చేసుకోవాలి. ఆ తర్వాత ఎరువులు వాడాలి. పంటకు ఎరువుల అవసరం.. నాటువేసే పద్ధతిలో, ఆరుతడి పద్ధతిలో ఒకే విధంగా ఉంటుంది.
- అవసరాన్ని బట్టి పురుగు మందులు కూడా స్ప్రే చేయాలి.



మొలక వచ్చిన మెట్ట వరి చేను (ఫైల్‌)

ఎరువులు వృథా కావు

మెట్ట వరి విధానం ద్వారా పంటకు వేసిన ఎరువులు వృథాకావు. నేరుగా దుక్కిలో వేయడం వల్ల మొక్కలకు పోషకాలు అందుతాయి. యూరియా తదితర ఎరువులు వేసినప్పుడు నీటిని పెట్టినా.. ఆ నీరు ఇంకే వరకు మళ్లీ నీరు పెట్టాల్సిన అవసరం ఉండదు దీనివల్ల ఎరువుల వృథాను అరికట్టవచ్చు. అదే సాధారణ సాగులో ఎరువులు నీటిలో కరగడం వల్ల ఎక్కువగా వాతావరణంలో కలిసిపోతాయి. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కొట్టుకుపోతాయి. కానీ, మెట్ట వరిలో ఈ పరిస్థితి ఉండదు.

మీథేన్‌ వాయువు ఉత్పత్తి ఉండదు

సంప్రదాయ పద్ధతిలో సాగుచేసిన వరిలో ఎప్పుడూ నీరు నిల్వ ఉంటుంది. వరి మడిలో నిల్వ ఉన్న నీటి నుంచి మధ్యాహ్నం వేళ మీథేన్‌ వాయువు ఉత్పత్తి అవుతుంది. దీనిని గ్రీన్‌ హౌస్‌ గ్యాస్‌గా కూడా పిలుస్తారు. ఇది వాతావరణ కాలుష్యానికి కారణమవుతుంది. ప్రపంచంలో వరి నుంచే 30 శాతం మీథేన్‌ ఉత్పత్తి అవుతుందని ఒక అంచనా. దీనిని అరికట్టాలంటే వరిలో ఆరుతడి పద్ధతే శ్రేయస్కరమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఆరుతడిలో నీరు నిల్వ ఉండదు కాబట్టి మీథేన్‌ ఉత్పత్తి అసలే జరగదు.



సీడ్‌ డ్రిల్‌ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు (ఫైల్‌)



మధారిగూడెంలో కోతకు వచ్చిన మెట్ట వరి చేను (ఫైల్‌)

ఖర్చులో తేడాలు (ఎకరాకు) ఇలా..

నాటువేసే పద్ధతి	ఆరుతడి పద్ధతి
విత్తనం ఎకరాకు 30 కేజీలు	8 నుంచి 10 కిలోలు
నారుమడి తయారీకి రూ.500	ఏమీ ఉండదు
నారు పెంపకం ఖర్చు రూ.1000	ఏమీ ఉండదు
భూమి దున్నేందుకు (ఆరుసార్లు) గొర్రుతో సహా రూ.8000	దున్నకానికి (రెండుసార్లు) రూ.4000
వరాలు (గట్లు) చెక్కడానికి రూ.2000	ఏమీ ఉండదు
నాటు వేసేందుకు కూలీలకు రూ.6000	రూ.500 మాత్రమే
కలుపు మందుకు రూ.2100	రూ.1800 (రెండుసార్లు)
ఎరువులకు రూ.5000	ఇక్కడ కూడా రూ.5వేలే
పురుగు మందులకు రూ.5000	రూ.3500
పంట కోతకు రూ.4500	రూ.3000
దిగుబడి 35 బస్తాలు	40 బస్తాలు

కూలీల కొరత వల్లే మెట్ట వరి వైపు..



పొలం సిద్ధం చేసుకున్న తర్వాత నాటు వేయడానికి కూలీలు సమయానికి రాకపోవడం వల్ల ప్రతి సీజన్‌లో చాలా ఇబ్బంది పడ్డాం. కూలీల కొరతను అధిగమించడానికి మూడు సంవత్సరాలుగా మెట్ట వరి సాగు చేస్తున్నాను. ఈ పద్ధతిలో పెట్టుబడి తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతోంది. ఇప్పుడు ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల ఎక్కువగా దిగుబడి వస్తోంది. – రిక్కల కరుణాకర్‌రెడ్డి, మధారిగూడెం, రైతు

మెట్ట సాగులో నీటి అవసరం తక్కువ



నాలుగు సీజన్ల నుంచి నేను మెట్ట వరి సాగు చేస్తున్నాను. దమ్ము చేసి నాట్లు వేస్తే పొలానికి రోజూ నీరుపెట్టాలి. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం సాగు చేయవచ్చనే శాస్త్రవేత్తల సలహాలతో మెట్ట వరి సాగు వైపు మొగ్గు చూపాను. మెట్ట వరి సాగులో కలుపు నివారణకు సమయానుసారం మందులను పిచికారీ చేసుకుంటే సరిపోతుంది. సాధారణ వరి సాగుతో పోల్చితే చీడపీడల ఉధృతి కూడా తక్కువే. దిగుబడి కూడా అధికంగానే వస్తోంది. – కంచి సోమయ్య, నీలాయిగూడెం, రైతు

కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం

భువనగిరి : విద్యుత్‌ మీటర్‌ రీడింగ్‌ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యుత్‌ మీటర్‌ రీడింగ్‌ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దోమకొండ సునీల్‌కుమార్‌ అన్నారు. అదివారం భువనగిరిలోని ప్రభుత్వ రిటైర్డ్‌ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 20 ఏళ్ల నుంచి మీటర్‌ రీడింగ్‌ కార్మికులుగా పని చేస్తున్నా నెలకు కనీసం రూ. 5వేలు కూడా రావడం లేదన్నారు. తమ స్యలపై పోరాటాలకు సిద్ధం అవుతున్నామని, అందుకోసం కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పక్కీ శ్రీనివాస్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీనివాస్‌, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

- సుమారు 800 మంది హాజరు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఎస్జీటీల సర్వీస్‌ బుక్‌, ధ్రువపత్రాల పరిశీలన ఆదివారం ముగిసింది. సుమారు 800 మంది ధ్రువపత్రాలను వెరిఫికేషన్‌ చేశారు. భువనగిరిలోని బీచ్‌మమహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు.

సమస్యలపై వినతి

విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపర్చిన జాబితాలో లోకల్‌బాడీ పాఠశాల ఉపాధ్యాయులు పేర్లు ప్రభుత్వ పాఠశాలల జాబితాలో ఉండటం, 398 ప్రత్యేక టీచర్ల అంశం, డీఎస్సీలో ఎక్కువ మెరిట్‌ వచ్చిన అభ్యర్థులు జాబితాలో కింద ఉండడం, తక్కువ మెరిట్‌ వచ్చిన వారు పైన ఉండడంతో సంబంధిత ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జాబితాలో మార్పు చేయాలని, అర్హుల పేర్లను చేర్చాలని విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

బదిలీలను రద్దు చేయాలని ధర్నా



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియక ముందే పైరవీలతో కొందరిని బదిలీ చేశారని, వాటిని రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జీరో సర్వీస్‌ ఉపాధ్యాయులకు సైతం బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మిరియాల దామోదర్‌, ఎస్‌.భాస్కర్‌, ముక్కెర్ల యాదయ్య, మైలారం సత్తయ్య, కె.రాజగోపాల్‌, ఎన్‌.లక్ష్మీనర్సింహారెడ్డి, గోపాలకృష్ణ, సత్తయ్య, మురళీ, ప్రవీణ్‌కుమార్‌, గిరీష్‌కుమార్‌, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలో లోపాలను సరిచేయండి

బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య కోరారు. భువనగిరిలోని బీచమహల్లా పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలన సదర్భంగా ఆయన మాట్లాడారు. సీనియారిటీ జాబితాలో లోపాలున్నాయన్నారు. సర్టిపికెట్ల వెరిపికేషన్‌ హాజరుకాని ఉపాధ్యాయులకు మరో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కోశాధికారి ఇటికాల మల్లేశం, కార్యదర్శులు బి.ముత్యాలు, ధర్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవికుమార్‌, రమణరావు, వెంకటేశం పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

- ప్రభుత్వ విప్‌ గొంగిడి సునీత



సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత

ఆలేరురూరల్‌ : రాష్ట్ర అభివృద్ధిపై బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ప్రభుత్వ విప్‌ గొంగిడి సునీత అన్నారు. ఆదివారం కొలనుపాకలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం అప్పులు చేసింది ప్రాజెక్టుల కోసం, ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి చేయడానికని, నేడు ఉత్తత్తి పెరగడంతో అన్ని రంగాలు ముందుకెళ్తున్నాన్నారు.అవగాహన లేని కొందరు ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని మారుమూల ప్రాంతాలకు సైతం తీసుకెళ్లాన్న లక్ష్యంతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం జిల్లాకు 54 పల్లె దవాఖానలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని కొలనుపాక, గొలనుకొండ, రాఘవాపురం, కొల్లూరు, శారాజీపేట, బహదూర్‌పేటలోనూ పల్లె దవాఖానలు వస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్‌, జంగస్వామి, మామిడాల అంజయ్య, మురళీ, కొండల్‌, సిద్ధేశ్వర్‌, మల్లేషం, సిద్దులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజ చేస్తున్న ప్రధానాచార్యులు

యాదగిరిగుట్ట : పంచనారసింహులు కొలువైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు విశేషంగా చేపట్టారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం స్వామివారికి నిజాభిషేకం, సహస్రనామార్చన చేసి, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో నారసింహహోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవ, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన చేపట్టారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

క్లుప్తంగా

కనీస పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలి

● ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

భువనగిరి : పెన్షనర్లకు కనీస పింఛన్ కింద నెలకు రూ.9వేలు ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయం సమావేశం మందిరంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పెన్షనర్లకు ప్రతి నెల 1వ తేదీన పెన్షన్ ఇవ్వడంతో పాటు ఆర్టీసీలో 50 శాతం చార్జీని మినహాయించాలన్నారు. పెన్షనర్లందరికీ ఆదాయ పన్ను మినాయించి, ఆస్పత్రిలో వైద్యం కోసం ఇచ్చే ఖర్చును పెంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను ద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని కోరారు. అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, రంగయ్య, వీరన్న, సీతారాం, రామచంద్ర, వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, యాదయ్య, రామస్వామి, బాలరాజు, బుగ్గయ్య, కాచరాజు జయప్రకాష్, శకుంతల, శంకర్‌రెడ్డి, బాలేశ్వర్, రాజయ్య పాల్గొన్నారు.

మహిళా బిల్లు ప్రచారానికే పరిమితం

● పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

ఆలేరు : మహిళా బిల్లు పాలక పార్టీలకు ఎన్నికల ప్రచారానికే పరిమితం అయ్యిందని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య అన్నారు. ఆలేరులోని టీఎన్‌జీఓ భవన్‌లో ఆదివారం జరిగిన ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) మహాసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్ట సభల్లో మహిళా బిల్లును ఆమోదించి మాట నిలబెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లును ఆమోదించేలా ప్రతిపక్షాలు కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. వేదికల మీదే పాలక పార్టీలు స్త్రీలకు సమాన హక్కులు అంటూ మాట్లాడుతూ వాస్తవంలో వంటింటికే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. సభకు ముందు పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మాలోతు సుగుణ జెండా ఆవిష్కరించగా, సభకు అధ్యక్ష వర్గంగా మాలోతు సుగుణ, గడ్డం మంజుల, కళ్లెపు నీలమ్మ వ్యవహరించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు ఇక్కిరి మాధవి, మామిడాల లక్ష్మి, కళ్లెపు గాలమ్మ, కొంగరి యాదమ్మ, ఎల్లమ్మ, నల్ల ఎల్లమ్మ, ఒడిచర్ల సత్తమ్మ, భూపెల్లి సువార్త తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

రమణీయం..స్వామివారి కల్యాణం





మాంగళ్యధారణ గావిస్తున్న వేదపండితులు, స్వామివారి ఊరేగింపులో పట్టువస్త్రాలను తీసుకొస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కల్యాణ ఘట్టం సాగిందిలా..

- ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు ప్రధాన ఆలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ప్రత్యేక పూజల అనంతరం మహామండపం నుంచి స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై 4.45 గంటల వరకు కల్యాణ మండపానికి తీసుకొచ్చారు.
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పట్టు వస్త్రాలు, తలంబ్రాల బియ్యం తీసుకొచ్చారు.
- ప్రస్తుతం గట్టుపై కల్యాణ మండపం పనులు జరుగుతున్నాయి. దీంతో మండపం కింద ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకిరించి కల్యాణ ఘట్టం పూర్తి చేశారు.
- 5.45 గంటలకు కలెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పించారు.
- 6.20కు జీలకర్ర బెల్లం కార్యక్రమం అనంతరం 6.45 కి మంగళ్యధారణ గావించారు.



కోనేరులో స్నానం చేస్తూ శివనామస్మరణ చేస్తున్న భక్తురాలు

వైభవంగా శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం

● పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
● భారీగా తరలివచ్చిన భక్తులు
● శివనామస్మరణతో మార్మోగిన చెర్వుగట్టు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగ్వేర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం తెల్ల వారుజామున స్వామి, అమ్మవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు నందివాహనంపై స్వామి, అమ్మవార్లను ప్రధాన ఆలయం నుంచి కల్యాణ మండపం వద్దకు మంగళవాయిద్యాలతో తీసుకొచ్చారు. వేద పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్యశాస్త్రి, నీలకంఠశివాచార్య, దేవాలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్‌శర్మ అర్చక బృందం వేద మంత్రోచ్చరణల నడుమ కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. స్వామి వారికి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నూతన పట్టువస్త్రాలు, తలంబ్రాల బియ్యాన్ని సమర్పించారు. స్వామివారి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి దంపతులతో పాటు భారీ



గుండు వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఇతర జిల్లాల్లోని భక్తులు శనివారం రాత్రి ఆలయానికి చేరుకోవడంతో చెర్వుగట్టు జనసంద్రంగా మారింది. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు భక్తులు తలంబ్రాల బియ్యాన్ని తెచ్చి స్వామివారికి సమర్పించారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, వివిధ శాఖల అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోగా, నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, నార్కట్‌పల్లి సీఐ శివరాంరెడ్డి, శాలిగౌరారం సీఐ రాఘవరావు, ఎస్‌ఐ రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు.

చెర్వుగట్టు ఆలయ అభివృద్ధికి కృషి : చిరుమర్తి

చెర్వుగట్టు ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. కల్యాణం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ప్రతియేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలోనే కాకుండా అమవాస్యకు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని తెలిపారు. త్వరలో సీఎం కేసీఆర్‌ను ఆలయానికి తీసుకువచ్చి ప్రముఖ శైవక్షేత్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ జయచంద్రారెడ్డి ఎంపీపీ, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, సర్పంచ్ మల్ల బాలకృష్ణ, తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీఓ యాదగిరి కార్యనిర్వహణ అధికారి నవీన్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, ఉపసర్పంచ్ దోనాల శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ పుల్లెంల ముత్తయ్య, కమ్మంపాటి వెంకటయ్య, బొల్లేటి జ్ఞానేశ్వరచారి, బాలం భిక్షం తదితరులు ఉన్నారు.

కట్న కానుకలు రూ.6.18లక్షలు

మండలంలోని చెరువుగట్టులో శ్రీపార్వతీజడల రామలింగేశ్వరస్వామి కల్యాణం ఆదివారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవంలో భాగంగా భక్తులు శనివారం రాత్రి నుంచే ఆలయానికి పోటెత్తారు. ఈ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా భక్తులు సమర్పించిన కట్న కానుకలను ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.6.18లక్షలు వచ్చాయి. అయితే గత ఏడాది కట్న కానుకలు 10.19లక్షల ఆదాయం వచ్చింది. లెక్కింపులో నల్లగొండ దేవదాయ, ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ కె.మహేందర్‌కుమార్, దేవస్థాన కార్య నిర్వహణ అధికారి నవీన్, దేవదాయ, ధర్మదాయ డివిజనల్ పరిశీలకులు వెంకటలక్ష్మి, దేవస్థాన ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మలతో పాటు పలువురు ఆలయ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి అవతారంలో భజన చేస్తున్న కళాకారుడు



తలంబ్రాలు తీసుకొస్తున్న శివసత్తులు



కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కోనేరులో భక్తుల పూనకాలు



తలంబ్రాలను సమర్పించేందుకు క్యూలైన్‌లలో బారులుదీరిన భక్తులు

క్రీడలు స్నేహ సంబంధాలు పెంపొందిస్తాయి

● మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: క్రీడా పోటీలు స్నేహ సంబంధాలు పెంపొందించేందుకు దోహద పడుతాయని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని పలివెల గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుపొందినా చిట్యాల జట్టుకు రూ. 30,116లతో పాటు షీల్డు, రెండో స్థానంలో నిలిచిన పలివెల టీంమ్ సభ్యులకు రూ. 20166లతో పాటు షీల్డులు అందజేశారు. అంతకు ముందు ఆ గ్రామంలోని భక్త మార్కండేయ శంకర భవానీ దేవాలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, నాయకులు దోనూరి వీరారెడ్డి, బూడిద లింగయ్య యాదవ్, ఎంపీటీసీ చెర్కు కృష్ణయ్య, జాల వెంకన్న యాదవ్, చెరుపల్లి వెంకన్న, చెర్కు మల్లయ్య, చెర్కు జనార్దన్, నడిపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

యాదాద్రిలో మంత్రి ఎర్రబెల్లి పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు మంత్రి ఎర్రబెల్లికి సంప్రాదాయంగా స్వాగతం పలికారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలో ఉత్సవ మూర్తుల వద్ద అష్టోత్తర, సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న మంత్రి దయాకర్‌రావుకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం తప్పదు

చౌటుప్పల్ : రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం తప్పదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. గత రెండు పర్యాయాలు కల్లిబొల్లి కబుర్లు, మాయమాటలతో ఓట్లు దండుకున్న బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. మండల పరిధిలోని ధర్మోజిగూడెం, ఆరెగూడెం గ్రామాల్లో ఆదివారం పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ పటిష్టత, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పేరిట కొత్త డ్రామాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. సొంత ప్రయోజనాల కోసమే జాతీయ రాజకీయాలంటూ హడావుడి చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారం బీజేపీదేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, బీఆర్ఎస్ నాయకుల అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశాల్లో మండల పార్టీ అధ్యక్షుడు రిక్కల సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మునగాల తిరుపతిరెడ్డి, నాయకులు మన్నె ప్రతాప్‌రెడ్డి, పక్కీరు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం రవీందర్, కొంతం బుచ్చిరెడ్డి, పిసాటి బాల్‌రెడ్డి, మునగాల మహిపాల్‌రెడ్డి, సామమహేందర్‌రెడ్డి, దిండు భాస్కర్, అనంతుల ఐలయ్య, మునగాల రాజశేఖర్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పిసాటి దామోదర్‌రెడ్డి, కొంతం కృష్ణారెడ్డి, గునగంటి స్వామి, బద్దం కృష్ణ, రాజు, ఉపేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీశైలం ఉన్నారు.



మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రామోజీఫిల్మ్ సిటీ దగ్గరలో ఇక్కు నిర్మిస్తున్న HMDA అప్రూవ్ వెంచర్‌లో కంపెనీ డైరెక్ట్ ప్లాట్లు ఇంట్రెస్ట్ గలవారు మాత్రమే. సంప్ర: 9515438614 [G-3060]

HOUS FOR SALE

■ Miryalagua First Gated Community, 92 Luxury Villas Club - House, Swimming Pool. Ready to Occupy Just RS.1.11Cr. Call: 9502277099 [H-793312]

Wanted

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ మహారాష్ట్ర మరియు కర్నాటక నందు పనిచేయుటకు అనుభవం ఉన్న సైట్ సూపర్‌వైజర్స్, డ్రైవర్స్ కావలెను PVR Projects Ltd Hyd. ఫోన్: 040-23348080, 23338080. E-Mail: adm.vineela@gmail.com [H-793551]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779863]

■ స్టార్ హోంకేర్ Hyd. లో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు, టెలీకాలర్స్ కావలెను. జీతం : 16,000/- to 25,000/-. రూం + భో. ఫ్రీ. ఫోన్ : 86391 32775, 86398 28228 [V-775091]

■ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మార్కెటింగ్ Experience ఎగ్జిక్యూటివ్ కావలెను. అర్హత: Any డిగ్రీ, Salary 15000 to 20000+TA+DA మరియు Insentives. సంప్ర:: 9553803333 [Y-784201]

Services

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-932]

మ్యారేజ్ లైన్స్

■ సాయిలక్ష్మి మ్యారేజ్ లైన్స్: ప్రైవేట్, సాఫ్ట్‌వేర్, Govt జాబ్స్ వారికి మొదటి, రెండవ, లేట్, ఇంటర్ క్యాస్ట్ అన్ని కులముల వారికి పెళ్లి సంబంధాలు కుదిరించబడును. సంప్ర:: 7702279912 [YA-6625]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034974058 [H-792913]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఎస్‌పీఎల్



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



టాస్ వేస్తున్న డీఎస్పీ నాగభూషణం

SAKSHI PREMIER LEAGUE

● రెండో రోజు పోటీలను ప్రారంభించిన సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional Sponsor

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు ఉత్సాహంగా కొనసాగింది. సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ వారు రీజినల్ స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తున్న ఈ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం వివిధ జట్ల మధ్య రసవత్తరంగా మ్యాచ్‌లు జరిగాయి. సూర్యాపేట డీఎస్పీ పి.నాగభూషణం హాజరై క్రికెట్ మ్యాచ్‌లను టాస్ వేసి ప్రారంభించి మాట్లాడారు. సాక్షి యాజమాన్యం క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతాయన్నారు. క్రీడలతో స్ఫూర్తి కలుగుతుందన్నారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సాక్షి ఆర్‌సీ ఇన్‌చార్జి వర్దెల్లి అరుణకృష్ణ, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ బొడ్డు నాగరాజు, సిబ్బంది జానయ్య, యాకయ్య, లింగారెడ్డి, మోహన్, రిపోర్టర్లు వేణు, నరేందర్, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసవత్తరంగా..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ మ్యాచ్‌లు రెండో రోజు రసవత్తరం

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

సాగాయి. సీనియర్స్ విభాగంలో మిర్యాలగూడ శాంతినికేతన్ కళాశాల విద్యార్థులు, నల్ల గొండ ఎన్‌జీ కళాశాల జట్ల మధ్య పోరు జరిగింది. ఈ పోటీలో మిర్యాలగూడ జట్టు 10 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోగా 124 పరుగులు సాధించింది. గెలుపు లక్ష్యంతో ఎన్‌జీ కళాశాల విద్యార్థులు బ్యాటింగ్ దిగి 9ఓవర్లలో 51 పరుగులకే ఆల్ అవుటై ఓటమి చెందారు.

సునాయాసంగా గెలుపు..

సీనియర్స్ విభాగంలో సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట విద్యార్థుల జట్లు తలపడ్డాయి. మొదట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట విద్యార్థులు బ్యాటింగ్‌కు దిగి 10 ఓవర్లలో 6వికెట్లతో 52 పరుగులు సాధించారు. కాగా, 53 పరుగుల లక్ష్యంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు బ్యాటింగ్‌కు దిగి నాలుగు ఓవర్లలోనే 54 పరుగులు సాధించి సునాయాసంగా గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు.

హోరాహోరీగా..

మిర్యాలగూడ శాంతినికేతన్ కళాశాల, సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థుల మ్యాచ్ హోరాహోరీగా సాగింది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. మొదట శాంతినికేతన్ విద్యార్థులు బ్యాటింగ్ ఎంచుకొని 10 ఓవర్లలో 97 పరుగులు సాధించారు. ఎస్వీ డిగ్రీ కళాశాల సూర్యాపేట విద్యార్థులు 10 ఓవర్లలో 95 పరుగులే చేశారు. దీంతో శాంతినికేతన్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసి ఫైనల్‌కు చేరుకున్నారు.





సెమీ ఫైనల్‌కు ఎంపికైన సూర్యాపేట మెడికల్ కళాశాల టీమ్, ఫైనల్‌కు చేరుకున్న శాంతినికేతన్ మిర్యాలగూడ టీమ్